మారో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

రిగ్గింగ్‌ను అడ్డుకున్న మహిళలు

రిగ్గింగ్ ప్రయత్నాన్ని మహిళలు పలుచోట్ల అడ్డుకున్నారు. గొట్లూరులో మంత్రి సత్యకుమార్ పీఏ హరీష్ రిగ్గింగ్‌కు ప్రయత్నించారంటూ మహిళలు అడ్డుకున్నారు. తాడిగడప మున్సిపాలిటీ 24వ వార్డులోని 76, 77 బూత్‌లలో దొంగ ఓట్లు వేయించే ప్రయత్నాన్ని వైయస్సార్‌సీపీ ఏజెంట్లు అడ్డుకున్నారు. సిద్ధవటం మండలం ఉప్పరపల్లిలో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చారన్న అనుమానంతో కొందరిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బి.కొత్తకోటలో బయటి నుంచి వచ్చినవారిని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ ప్రశ్నించారు. రేణిగుంటలో జనసేన ఏజెంట్లను బయటకు పంపి టీడీపీ రిగ్గింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారంటూ వినుత కోట పోలీసులను నిలదీశారు.

రాజ్యాంగ దినోత్సవాన రక్తపాతమా?

రాజ్యాంగ దినోత్సవాన ఓటు హక్కును హరించిన చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. రిగ్గింగ్, దాడులు, దౌర్జన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బూత్ దగ్గర తన బాధ్యత నిర్వర్తించేందుకు వెళ్లిన మనిషి రక్తగాయాలతో ఆసుపత్రికి పోవాల్సిన దుస్థితి రావడం రాజ్యాంగం తలదించుకునేలా చేస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది. ఏజెంట్లను గెంటేయడం, దాడులు చేయడం, దౌర్జన్యంగా రిగ్గింగ్ చేయడం, ఓటు హక్కును హరించడం లాంటి తీవ్రమైన దుర్మార్గాలకు పాల్పడటంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. దాడి చేసినవారిపైనా, విధి నిర్వహణను విస్మరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, నరసంపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ శ్రేణుల రాళ్లదాడి. రిగ్గింగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలను బలవంతంగా బయటకు నెట్టిన పోలీసులు.